Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :9.014(2025); IC VALUE:5.16; ISI VALUE:2.286
PEER REVIEWED AND REFEREED INTERNATIONAL JOURNAL
(Fulfilled Suggests Parameters of UGC by IJMER)
Volume:14, Issue:12(7), December, 2025
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed: Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available: www.ijmer.in

# "సుమతీ శతకం – స్త్రీ ప్రబోధం"

**ద్వారంపూడి స్రవంతి**
స్కూల్ అసిస్టెంట్ – తెలుగు
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
అనపర్తి. సెల్ : 8522941516

**ప్రవేశిక :**

తెలుగు సాహిత్య ప్రక్రియల్లో శతక ప్రక్రియకు ఒక విశిష్టమైన స్థానం ఉంది. శతకమనగానే ఏదో ఒక సందేశం అందించే ఉపదేశాత్మక పద్య ప్రక్రియగా సాహిత్య చరిత్రలో నిలిచింది. సంఖ్యా నియమం, మకుట నియమం ప్రధానంగా చేసుకుని ఏ పద్యానికి ఆ పద్యమే ప్రత్యేక అంశాన్ని వస్తువుగా చేసుకుని ప్రజలకు లోక నీతిని, లోక రీతిని తెలియజేసేదిగా కనిపిస్తుంది. శతకం భక్తి ప్రభోదాత్మకంగా పల్కూరికి సోమనాథుని వృషాధిపశతకంతో మొదలై నేటి ఆధునిక కవుల శతకాల వరకు వస్తున్న వాటిలో వస్తువులో మార్పును గమనిస్తాం. కేవలం భక్తే ప్రధానంగా కాకుండా సమాజంలో జరిగిన, జరుగుతున్న అనేక సంఘటనలకు, సమస్యలకు స్పందించి లోకహితాన్నే ప్రబోధించే స్థాయికి శతకం చేరుకుంది. ప్రాచీన కాలం నుండి ఆధునిక కాలం వరకు నిరంతర స్రవంతిలా విభిన్న అంశాలను స్పృశిస్తూ కలాలను సంధిస్తున్నారు నేటి కవులు. ఇది శతకం యొక్క ప్రత్యేకతగా గుర్తించవచ్చు. అందుకే శతకం సామాజిక స్పృహను కల్గిస్తూ సమాజాన్ని చైతన్యవంతం చేసే దిశగా విస్తరించి విరాజిల్లుతుంది. ప్రక్రియ ప్రాచీన పద్య సంబంధి అయినా వస్తు స్వీకరణలో మాత్రం ప్రజా భాషను సొంతం చేసుకుని ఆబాలగోపాలాన్ని ఆనందింపచేస్తూ, విద్యార్థుల పాటిట నైతిక విలువలను ప్రబోధిస్తూ సత్ప్రవర్తనకు సౌశీల్యానికి ఉపదేశ సోపానాలుగా "శతక పద్యాలు" చెరగని ముద్ర వేసాయి, ఇదే శతక సాహిత్య విశిష్టత.

**వ్యాస ముఖ్యోద్దేశ్యం :**

శతసహస్రాధికంగా శతక రచనలు పురోగమన పథంలో పయనిస్తు నేటకీ కొనసాగడం ఆశ్చర్యం కలిగిస్తుంది. శాస్త్ర సాంకేతికాభివృద్ధిని సాధిస్తూ ఎంత విజ్ఞానాన్ని సంపాదించుకున్నా మన ప్రాచీన సాహిత్య అధ్యయనంలో పద్యాన్ని విస్మరించకుండా, భాషను సరళతరం చేసుకుంటూ నిఘంటు అవసరత లేకుండా క్లిష్టమైన, కష్టమైన పదబంధాల జోలికి పోకుండా, పాండిత్య ప్రకర్షను బలవంతంగా పాఠకుల మనసుల్లో రుద్దకుండా అందరికి అర్థమయ్యే రీతిలో సీస కంద ఆటవెలదులలోను, తేటగీతులతోను తేట తెను పద్యాలను అందించడం వల్ల శతకం ఆధునికయుగంలో ఆదర్శ ప్రక్రియగా, ఆదరణ పొంది నూతనత్వంతో నవ్యోదయానికి నాంది గీతంలా నిలిచింది. అటువంటి శతకాల్లో సుమతీ శతకం అత్యుత్తమ స్థానాన్ని పొందింది. ఈ శతకంలో సామాజిక స్పృహ, లోకనీతి, లోకరీతి, విభిన్న మనస్తత్వాల చిత్రణ ఉంది. అందులో ప్రధానంగా బద్దెన చెప్పిన మహిళా ప్రబోధాన్ని వివరించే ప్రయత్నమే ఈ వ్యాస ఉద్దేశ్యం.

**కీలక పదాలు :**

స్త్రీల మనస్తత్వాలు, పురుషుల మనస్తత్వాలు, సమాజ స్థితి, స్త్రీల ఔన్నత్యం, త్యాగాలు, ప్రాచీనుల అభిమతం, సమానత, పరివర్తనావాదం, ఆదర్శజీవితం, సమైక్యభావన మొదలైనవి.

**విషయ వివరణ :**

శతకమంటే వెంటనే గుర్తుకు వచ్చేవి వేమన, సుమతి, బాస్కర వంటి శతకాలు. ఇవి రాని తెలుగు వారు, తెలియని తెలుగు వారు ఉండరు. కనీసం ఒక పద్యమైనా నోట రాకుండా ఉండదు. విద్యార్థులు చిన్ననాటి నుండే

Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :9.014(2025); IC VALUE:5.16; ISI VALUE:2.286
PEER REVIEWED AND REFEREED INTERNATIONAL JOURNAL
(Fulfilled Suggests Parameters of UGC by IJMER)
Volume:14, Issue:12(7), December, 2025
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed: Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available: www.ijmer.in

ఈ పద్యాలను కంఠోపాఠం చేయడం వల్ల సమాజాన్ని, మానవీయ విలువలను, సేవా దృక్పధాన్ని, సామరస్య భావనతో పాటు నైతిక విలువలను పెంపొందించుకోవడంతోను భక్తితత్పరతలను అలవాటు చేసుకోవడానికి ఎంతగానో ఉపయోగపడ్డాయని చెప్పవచ్చు. 12వ శతాబ్దంలో మొలకెత్తిన శతకం 21వ శతాబ్దంలో కూడా సందేశాత్మక పరిమళాలను వెదజల్లుతు దిన దిన ప్రవర్ధమానం చెందుతూ సాహిత్య చరిత్రలో సువర్ణధ్యాయాన్ని నెలకొల్పింది. అటువంటి శతకాల్లో సుమతీ శతకంలో బద్దెన మహిళల మనస్తత్వాలు, వివిధ భావనలు, ముందు వరుసలో నిలిచిన సమాజంలోని మహిళల స్థానం, పొందిన గౌరవం, పొందే అవమానం, నిర్ధేశించిన నియమాలు, విధించిన ఆంక్షలు, అందంగా చిత్రించిన కథలు, వర్ణనలో స్త్రీ, వర్ణ వివక్షలో స్త్రీ, సమాజంలో మహిళా స్థానం, పురుషుల దృష్టిలో స్త్రీ వంటి అంశాల పై బద్దెన స్పందించాడు.

బద్దెన నీతి ముక్తావళిని రచించినా సర్వజనాదరణ పొందిన రచన సుమతీ శతకమే. దీనిలో ఉన్న ప్రతీ పద్యం నిక్కమైననీలమే. ఈ పద్యాలు అందరిని ఆకర్షించడమే కాదు ఆలోచింప చేస్తాయి. మనిషి ప్రవర్తనలో మార్పును తెస్తాయి. అలాగే సమాజంలో పరివర్తనవాదాన్ని, ప్రవర్తనవాదాన్ని కలిగిస్తాయి. ముఖ్యంగా మహిళల కోసం బద్దెన చేసిన ప్రబోధలో నేటి తరానికి ఒక సైద్ధాంతిక అంశంగా, వాస్తవికాంశంగా కనిపిస్తుంది. మన భారతీయ వ్యవస్థలో అతి ప్రాచీన సంస్కృతి ప్రాథమిక సాంస్కృతికగా కనిపించే మాతృస్వామ్య వ్యవస్థతో కూడిన మూల సంస్కృతి. ఆ కాలంలో స్త్రీలదే అగ్రస్థానం, స్త్రీలదే అధికారం, ఆలనాపాలనా స్త్రీలదే. తరువాత పరిణామక్రమంలో పితృస్వామ్య వ్యవస్థ వచ్చిన తరువాత పురుషాధిక్యత పెరిగి నిబంధనల చట్రంలో మహిళ ఇరుక్కుపోయింది. ధర్మశాస్త్రాల్లోను, మత గ్రంధల్లోను, స్త్రీ స్వేచ్ఛ కోల్పోయి అణచివేతకు గురైంది. అందుకే "న స్త్రీ స్వాతంత్ర్య మనర్హతి" అన్న వేదనాదలే నిరసన హక్కుల ఉద్యమానికి దారి తీసింది. ఆధునిక కాలంలో ఆ నిరసనల వలన ఫలితంగానే రాజ్యాంగస్ఫూర్తితో నేటి మహిళ సర్వోన్నతమైన స్థానంలో నిలిచి ఆదర్శమహిళగా అన్ని రంగాల్లోను అగ్రగణ్యమైన స్థానాన్ని పొంది సమానతా గీతాన్ని ఆలాపిస్తుంది. బద్దెన మహిళలకు హితబోధచేస్తూ కొన్ని సూచనలు పాటిస్తే మంచిదంటూ

**నవ్వకుమీ సభలో పల**
**నవ్వకుమీ తల్లితండ్రుల నాథుల తోడన్**
**నవ్వకుమీ పరసతితో**
**నవ్వకుమీ విప్రవరుల నయమిది సుమతీ...** అంటాడు.

"నవ్వు నాలుగు విధాల చేటని" ఒక మంచి సామెత ఉంది. ఏ పనిని ఎప్పుడు చేయాలో అప్పుడే చేయాలి. ఎవరి పని వారే చేయాలి. అది గమనించినచో అన్ని వేళలా మేలే జరుగుతుంది. కాని వ్యతిరేక మార్గంలో పయనిస్తే పతనావస్థతో పాటు పరువు మర్యాదలు మంట గలిసిపోతాయ్. ఇటువంటి వాస్తవిక సత్యాలను వెళ్లడిస్తూ బద్దెన స్త్రీలకు ఉపదేశాత్మకంగా కొన్ని అంశాలను గుర్తు చేస్తాడు. స్త్రీలు పగలబడి నవ్వడం, సభల్లో నవ్వడం మంచిది కాదంటాడు. స్త్రీలు ఎప్పుడూ పరిసరాలను గమనించాలంటాడు. అందుకే సభల్లో నవ్వవద్దంటాడు. అక్కడ ఉండేది ధర్మాధర్మాలు తెలిసివారు. మర్యాద ఎరిగినవారు. పెద్దరికంతో పదవుల్లో ఉన్నవారు అటువంటి చోట నవ్వితే నవ్వులపాలవ్వక తప్పదంటాడు. దానికి సాదృశ్యంగా ద్రౌపది, లక్ష్మణ, దేవర నవ్వు స్ఫురణకు తెస్తాడు. స్త్రీలు ఎంత జాగ్రత్తగా ఉండాలో గుర్తుచేస్తాడు. మరికొన్ని విషయాలు చెబుతూ తల్లిదండ్రులతోను, భర్తతోను పరిహాసం ఆడకూడదంటాడు. అలాగే ఇతరుల దగ్గర, బ్రహ్మణుల దగ్గర నోటిని అదుపులో ఉంచుకోమంటాడు. నవ్వు వచ్చు కాని నవ్వుల పాలు కాకుడదనే సూక్తికి ఈ పద్యం ప్రతీకగా కనిపిస్తుంది. ముఖ్యంగా స్త్రీలను దృష్టిలో పెట్టుకుని సమాజంలో ఎవరి దగ్గర ఏవిధంగా ప్రవర్తించాలో బద్దెన మంచి సూచనగా చెబుతూ గొప్ప ఉపదేశాన్ని అందించాడు.

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :9.014(2025); IC VALUE:5.16; ISI VALUE:2.286
PEER REVIEWED AND REFEREED INTERNATIONAL JOURNAL
(Fulfilled Suggests Parameters of UGC by IJMER)
Volume:14, Issue:12(7), December, 2025
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed: Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available: www.ijmer.in

స్త్రీలు చేసే సేవలు మరువలేనివి. వారిలో ఉండే ఓర్పు, నేర్పు వర్ణనకందనిది. వేకువ జామునే లేచి ఇల్లంతా తుడవడం, తరువాత వంటావార్పు, పిల్లపాపలకు సమస్తాన్ని అమర్చి, భర్తను బయటకు పంపి తాను బయటకు పోయి జీవిక కోసం ఎన్నో పనులు చేస్తూ ఇంటా బయటా చాకిరీ చేసే శ్రమ జీవిగా నిలిచింది. ఈ మధ్యలో ఆమే పడే పాట్లు, అందులో అవమానాలు, అపనిందలు, లింగ వివక్ష, లైంగిక వివక్ష, అణచివేత, పురుషాధిపత్యఘోష ఇలా చెప్పనలవికాని సమస్యలతో, మానసిక సంక్షోభంతో ఎవరికిచెప్పుకోలేక ఇంటి గుట్టు బయట పెట్టలేక అన్నీ అనుభవిస్తూ పైకి ఆదర్శ మహిళగా జీవించే అనుభవాలు మనకళ్ళ ముందు కనిపిస్తూ ఉంటాయి. అందుకే స్త్రీలు ఎక్కడ గౌరవింపబడతారో అక్కడ సంపదలు నిలుస్తాయని చెబుతూ ఆమె శ్రమను వివరిస్తూ

**పనిచేయునెడల దాసియు**
**ననుభవమునరంభ, మంత్రియాలో చనలన్**
**దనభుక్తియెడల దల్లియు**
**ననదనకులకాంత యుండనగుర సుమతీ...** అంటాడు.

కులకాంత గొప్పతనాన్ని, ఆమె త్యాగాన్ని, చేసే సేవను గుర్తుచేస్తూ ఆమె ఇంటి పనులు చేసేటప్పుడు దాసిగానే వుంటుంది. కేవలం నాది నా కుటుంబం, నేను నా కుటుంబం అనే విశాల భావనతోనే శ్రమను మరిచి దాసిగా మారిపోతుంది. భర్త దగ్గర రంభగా, సర్వసుఖాలను అందించి మానసిక ఉత్తేజాన్ని కల్గించే రసదేవతగా నిలుస్తుంది. అలాగే భర్తకు గానీ, కుటుంబంలోని గానీ సమస్యలు తటస్థించినపుడు ధైర్యం కలిగి మంచి ఆలోచనలు అందించాలి అంటాడు.

ఆలోచనలు ఇచ్చేటప్పుడు భార్య ఒక గొప్ప మంత్రిగా వ్యవహరించాలని అంటాడు. ఆ ఆలోచనల ఫలితంగానే సమస్యలు పరిష్కరించబడి కుటుంబం "శాంతి నిలయం" గా నిలుస్తుంది అని అంటాడు. అలాగే భోజనం పెట్టేటప్పుడు భర్త ఆకలిని, పిల్లల ఆకలిని తీర్చేలా ఒక తల్లిలా వ్యవహరించాలి అంటాడు. ఈ పద్యాన్ని బట్టి చూస్తే బద్దెన స్త్రీల పట్ల ఎంత గౌరవం ప్రదర్శించాడో తెలుస్తుంది. ఈ పద్యానికి మూలం సంస్కృత శ్లోకం గుర్తుకు వస్తుంది. అందులో "షట్కర్మయుక్తం" గా చెబితే బద్దెన మాత్రం నాల్గు లక్షణాలను ప్రధానంగా చేసుకున్నట్లు ఈ క్రింది శ్లోకం వల్ల గుర్తించవచ్చు.

"కార్యేషు దాసి, కరణేషు మంత్రి, రూపేచ లక్ష్మీ, క్షమయా ధరిత్రి, స్నేహేచ మాతా, శయనేచ వేశ్యా, షట్కర్మయుక్తా కుల ధర్మ పత్నీ" ఈ శ్లోకంలో కనిపించే ఆరు లక్షణాల్లో కేవలం నాలుగు లక్షణాలకే బద్దెన ప్రాధాన్యతనిచ్చాడు. ఇటువంటి పద్యాలు సమాజానికి ఎంతో చైతన్యాన్ని, చక్కని సందేశాన్ని అందించి ఉపదేశాత్మకంగా నిలిచాయి.

బద్దెన తన శతకాల్లో సరళమైన పదబంధాల్ని ఉపయోగించి సామాజిక స్పృహను కల్గించాడు. సమాజంలో మనం చూస్తున్న సంఘటనలను, సన్నివేశాలను, వ్యక్తుల మనస్తత్వాలను, లోక రీతిని వివరించడం వల్ల ఈ పద్యాలు అందరి హృదయాల్లో చెరగని ముద్ర వేసాయి. అందులో స్త్రీల పట్ల బద్దెన చూపిన గౌరవమర్యాదలను పరిశీలిస్తే ఆనాటి భావన నేటికి అలాగే నిలిచింది. తను స్త్రీ పక్షపాతిగా నైతికతను, ఆధ్యాత్మికతను, సామాజికతను గుర్తుచేస్తూ అన్నింటిలో అగ్రస్థానంలో నిలచే ఏకైక వ్యక్తి స్త్రీయే కదా అనే భావనను మనలో కూడ కల్గిస్తాడు. దీనికి ఆధారంగా మనచుట్టు ఉన్న సమాజాన్ని చూపిస్తాడు. సమాజంలో ఎవరు గొప్పో, ఎవరు ప్రాధాన్యత గల వారో తెలియజేస్తూ

Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :9.014(2025); IC VALUE:5.16; ISI VALUE:2.286
PEER REVIEWED AND REFEREED INTERNATIONAL JOURNAL
(Fulfilled Suggests Parameters of UGC by IJMER)
Volume:14, Issue:12(7), December, 2025
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed: Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available: www.ijmer.in

**పురికి ప్రాణము కోమటి**
**వరికి ప్రాణము నీరు, వసుమతిలోనన్**
**గరికిని ప్రాణము తొండము**
**సిరికి ప్రాణము మగువ సిద్ధము సుమతీ...** అంటాడు.

ఈ పద్యంలో శబ్ద సౌందర్యం ఎంత అద్భుతంగా ఉందో అర్ధశోభ కూడా అంతే ప్రాధాన్యతను సంతరించుకుంది. అలతి అలతి పదాల పొందికగా కనిపించే ఈ పద్యంలో స్త్రీ యొక్క గొప్పదనం కనిపిస్తుంది.

పురానికి కోమటి ప్రాణములాంటివాడు, వ్యాపారాలు లేకుండా ఏ వస్తువులు దుకాణం దాటిరావు. ప్రజలకు కావలసిన నిత్యవసరాలు అందించే కోమటి ప్రాణంలాంటివాడు. అలాగగే వరికి ప్రాణము నీరు అంటాడు. నీరు లేకుండా ఏ పంట పండదు. అందుకే వరికి ప్రాణం నీరు అంటాడు. అలాగే ఏనుగుకు తొండము ప్రాణమంటాడు. దానికి తొండం ప్రాణం. ఏది తినాలన్నా, ఏది చేయాలన్న తొండం ప్రధానం. చివరిగా సంపదకు ప్రాణము స్త్రీ అంటాడు. సకలసౌభాగ్యాల సేకరణ స్థిరసిద్ధికి నిధి స్త్రీ అనే సత్యాన్ని గుర్తు చేస్తాడు. భర్త ఎంత సంపాదించినా దాన్ని అభివృద్ధి చేసేది, ఏవిధంగా ఉపయోగించాలన్న స్త్రీ హస్తమే ప్రధానం. ఒక స్త్రీ యొక్క గొప్పతనాన్ని, స్త్రీ తీసుకునే జాగ్రత్తలను గుర్తుచేసి ఇంటికి దీపం ఇల్లాలన్న సామెత మాదిరిగా ఇంటిలో సిరి సంపదలతో కళకళలాడుతున్న స్త్రీయే మూలాధారం, మూలధనం కూడా అంటాడు బద్దెన. ఆ రోజుల్లో స్త్రీలు ఇంటికి దీపంగా వెలుగుతూ అందరికి కాంతినిస్తూ ఆదర్శంగా నిలిచేవారు. కాని నేడు ఇంటికి ధూపంగా ఎందరో స్త్రీలు కుటుంబాలను కలహాలతో నింపి ధూపంతో ఊపిరాడకుండా చేస్తున్నారు.

స్త్రీ యొక్క ఔన్నత్యాన్ని, భర్త పట్ల ఉండే ప్రేమ, గౌరవ మర్యదలను గుర్తుచేస్తూ కలిమితో వున్నా, లేమితో వున్నా, రూపవందుడైనా, కురూపియైనా, చదువు వున్నా, చదువు లేకపోయినా భర్తను దైవంగా కొలవాలనే ఉ పదేశాన్ని అందిస్తూ

**తలమాసిన వొలుమాసిన**
**వలువలు మాసినను ప్రాణవల్లభుడైనన్**
**గులకాంతలైన రోతురు**
**తిలకింపగ భూమిలోపల దిరముగ సుమతీ...** అంటాడు.

లోకంలో ఏ స్త్రీ అయినా, ఎంత కులకాంతలైనా వారి భర్తలపట్ల అనురాగం కలిగి జీవించాలి. భర్త సంపాదనపరుడైతే ఒకలాగున, చదువరైతే ఒకలాగున చూడకూడదంటాడు. ఒకసారి జీవితంలో భర్తగా ప్రవేశించినప్పుడు ఎటువంటి ప్రేమబంధం ఉందో అదే బంధం తుది శ్వాస వరకు కొనసాగాలి. అప్పుడే భార్యభర్తల అనుబంధం. అంతే గానీ అస్థిరమైన భోగభాగ్యాలను బట్టి, అందచందాలను బట్టి కాదని హెచ్చరిస్తాడు బద్దెన. భర్తలు తలమాసిన, బట్టలు మాసిన, శరీర శుభ్రత లేకున్నా, అయిష్టంగా భార్య ఉండకూడదని అవన్నీ కలకాలం నిలిచేవి కాదని, స్థిరమైన మనస్సుతో ఏనాడైతే ఏడడుగులు వేసి కాపురంలోకి అడుగు పెట్టావో, ఏవిధమైన ప్రమాణాలు చేసావో ఆ ప్రమాణాలను నిలబెట్టుకోవాలనే భావనను కలిగిస్తాడు. ఇంటిలో గృహిణిగా ఉన్న స్త్రీని బట్టే పరువూ, మర్యాదలు నిలుస్తాయి. లేకపోతే సంసారం చిన్నాభిన్నమైపోతుంది. "ఇల్లును చూసి ఇల్లాలిని చూడాలనే" సామెతలా గుణవతియైన భార్య ఇంటికి దీపంలా ప్రకాశించాలి. పురుషుణ్ణి ఎదిరించి వీధిలోకి రాకూడదని, పతిని ప్రత్యక్ష దైవంగా చూడాలని, గౌరవించాలనే ఉపదేశాన్ని బద్దెన అందించాడు.

బద్దెన పురుషులకు కూడా హితోపదేశం చేస్తూ స్త్రీని గౌరవించాలని, ఆమె సేవలను గుర్తించాలని, వారిని కష్టపెట్టకూడదని ఆమె తను శరీరంలో సగభాగమని అందుకే ఆమె నీకు అర్ధాంగి అయిందని వివరిస్తూ

Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :9.014(2025); IC VALUE:5.16; ISI VALUE:2.286
PEER REVIEWED AND REFEREED INTERNATIONAL JOURNAL
(Fulfilled Suggests Parameters of UGC by IJMER)
Volume:14, Issue:12(7), December, 2025
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed: Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available: www.ijmer.in

**కులకాంత తోడనెప్పుడు**
**కలహింపకు వట్టి తప్పు ఘటియింపకుమీ**
**కలకంఠి కంటి కన్నీ**
**రొలికిన సిరియింట నుండి నొల్లదు సుమతీ...** అంటాడు

ప్రతి పురుషుడు భార్య పట్ల అమర్యాదగా ప్రవర్తించకూడదు. ప్రతీ విషయానికి గొడవలు రేపకూడదు. మనస్పర్ధలు వచ్చినా సర్దుకుపోయే తత్త్వం ఉండాలి. స్త్రీ సున్నితమైన మనస్తత్వం గల అబల. అందుకే ఆమెను అర్థం చేసుకుని అనుమానానికి తావివ్వకుండా, స్త్రీ అనే వివక్షత చూపకుండా నడుచుకోవాలనే హితవు ఈ పద్యంలో కనిపిస్తుంది. అందుకు తగ్గట్టుగా స్త్రీ కూడా పురుషుడి పై పెత్తనాన్ని చెలాయించకుండా సమైక్య భావనతో సంసారాన్ని గడపాలంటాడు. అందుకే కులకాంతతో ఎప్పుడు కలహించవద్దని, నేరములు మోపవద్దని, కన్నీరు పెట్టుకునే విధంగా ప్రవర్తించవద్దని, ఒక వేళ ఆమె కన్నీరు పెట్టినా ఆ ఇంట్లో సిరిసంపదలు నిలువవని గుర్తించుకోమంటాడు. బద్దెన స్త్రీలను ఏ విధంగా గౌరవించాలో సమాజానికి తెలియజేస్తాడు.

నేడు మనం చూస్తున్న సమాజంలో జరుగుతున్న ఘోరాల పై ఒకసారి దృష్టి సారిస్తే ఎన్ని కుటుంబాలు ప్రశాంత జీవితాన్ని గడుపుతున్నాయి. ఎన్ని కుటుంబాల్లో చిలికి చిలికి గాలివానై వీధుల్లో తుఫాను దెబ్బకు విరిగి పడిపోయిన పచ్చని చెట్టుల్లా కనిపిస్తున్నాయి. ఎన్నికుటుంబాలు అనుమానలతో చిన్నాభిన్నమైపోతున్నాయి, అవమానం పాలవుతున్నాయ్ ఆలోచించాలి. కవుల దూరదృష్టి ఇక్కడే తెలుస్తుంది. వారు రచనల్లో భూత భవిష్యత్ వర్తమానాల దృష్టి కోణం ఉంటుంది. అందుకే "రవి గాంచనిచో కవి గాంచునే" అన్న కవి తోక్తి స్మరణకు తెచ్చుకోవాలి, సమాజంలో నివసించే కవే సమాజాన్ని చైతన్యవంతం చేయడానికి సాహసిస్తాడు. అనేక సమస్యలను వస్తువుగా స్వీకరిస్తాడు. సంఘటనలు నిశితంగా పరిశీలించి ఏదో ఒక సందేశాన్ని అందించే ప్రయత్నం చేస్తాడు. అందుకే జాషువా "కవిని గన్న తల్లి గర్భంబు ధన్యంబు" అన్నాడు. బద్దెన స్త్రీల మనస్తత్వాలను పురుషుల మనస్తత్వాలను ఎంత నిశితంగా పరిశీలించాడో అర్థమౌవుతుంది. అలాగే కుటుంబంలో భార్య భర్తల బంధాలు, సమాజంలో స్త్రీ పురుషుల సంబంధ బాంధవ్యాలు గుర్తుచేస్తూ నేటి తరానికి ఒక ఉపదేశాన్ని అందించాడు. సమాజానికి ఒక నీతిని ప్రబోధిస్తూ నైతికతతో పాటు ప్రాపంచిక జ్ఞానం పొందాలి, మనుషులను, సమాజాన్నీ అధ్యయనం చేయాలి. అప్పుడే సమాజంలో మన స్థానం ఏంటో తెలుస్తుందంటాడు.

ఈ విధంగా బద్దెన తన సుమతీ శతకం ద్వారా సమాజంలో స్త్రీల మనస్తత్వ చిత్రణ వారి స్వభావాలు సేవలు, త్యాగాలు, ప్రేమానురాగాలు, ఆప్యాయతలను, నేటి పురుష సమాజం కూడ గుర్తించాలని, అలాగే కేవలం పురుషుడే కాదు స్త్రీలు కూడా పురుషుల మనసులను అర్థం చేసుకుని కుటుంబాల్లో సుఖశాంతులతో వెలుగులు నింపాలని, సమాజంలో ఎవరి బాధ్యతలు వారు నెరవేర్చి ఆదర్శ ప్రాయంగా నిలవాలని వివక్ష లేకుండా సమభావనతో అందరు కలిసి మెలిసి వసుధైక కుటుంబంగా సాగాలని నేటి సమాజానికి మంచి ఉపదేశాన్ని అందించాడు బద్దెన.

**ఆధార గ్రంథాలు :**

1. బద్దెన – సుమతీ శతకం
2. డా॥ ఎం.వి ఆర్ శాస్త్రీ – సుమతీ శతకము, వివేకనందునీ వ్యాఖ్య
2. డా॥ తరపట్ల సత్యనారాయణ – సాహితీ వ్యాసాలు.